నేడు కానుం పొంగల్



మెరీనా బీచ్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్

పర్యాటక ప్రాంతాలకు వెళ్లనున్న ప్రజలు

చెన్నైలో 15 వేలమందితో పోలీసుల భద్రత

పెరంబూర్, జనవరి 16: కానుం పొంగల్ సందర్భంగా మెరీనా, ఎలియట్స్ బీచ్ సహా పర్యాటక ప్రాంతాల్లో 15,500 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ప్రకటించారు. సంక్రాంతి పండుగ చివరి రోజైన కానుం పొంగల్ నాడు నగరం నుంచే కాకుండా పొరుగు జిల్లాలకు చెందిన వారు కూడా కుటుంబసభ్యులతో నగరం, శివారు ప్రాంతాల్లో పర్యాటక ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 15,500 మంది పోలీసులతో పాటు 1,500 హోంగార్డ్స్ భద్రతా విధులు చేపట్టనున్నారు. మెరీనా తీరంలోని కార్మికుల స్మారకస్థూపం నుంచి గాంధీ విగ్రహం వరకు మూడు పోలీసు అవుట్ పోస్టులు, కార్మికుల స్మారక స్థూపం నుంచి లైట్ హౌస్ వరకు ఉన్న 7వ సర్వీస్ రోడ్డులోని ప్రవేశ మార్గాల్లో పోలీసు కంట్రోల్ రూంలు ఏర్పాటు కానున్నాయి. అలాగే, అత్యవసర వైద్యసేవలకు వైద్య బృందాలు, 8 అంబులెన్స్‌లు, రెండు అగ్నిమాపక వాహనాలు సిద్ధం చేశారు. అలాగే, భద్రత కోసం మోటరు పడవలు, సుమారు 200 మంది గజ ఈతగాళ్లను సముద్రతీరాల్లో ఉంచామన్నారు. అలాగే, మెరీనా తీరంలో 13 వాచ్ టవర్లు ఏర్పాటుచేసి బైనాక్యులర్స్ ద్వారా పోలీసులు పర్యవేక్షించనున్నారు.

పిల్లల భద్రత ప్రత్యేక చర్యలు

రద్దీ ప్రాంతాల్లో తప్పిపోయే పిల్లలను సత్వరం రక్షించేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ప్రవేశ ద్వారాల్లోనే పిల్లల వివరాలు, తల్లిదండ్రుల సెల్‌ఫోన్ నెంబరు తీసుకొని, వారి చేతికి బ్యాండ్ ఏర్పాటు చేయనున్నారు. ఒకవేళ పిల్లలు తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన సందర్భంగా, గస్తీలో ఉన్న పోలీసులు ఆ పిల్లల చేతిలోని బ్యాండ్ ఆధారంగా తల్లిదండ్రులను సంప్రదించి వారికి అప్పగించే పనులు చేపట్టనున్నారు. ఇక, మెరీనా బీచ్, ఎలియట్స్ బీచ్‌లో తలా నాలుగు డ్రోన్ కెమెరాలను భద్రత కోసం వినియోగించనున్నారు. అలాగే, రద్దీగా ఉండే 12 ప్రాంతాలు గుర్తించి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే, గిండి, అడయార్, తరమణి, నీలాంగరై, దురైపాక్కం, మదురవాయల్ బైపాస్ రోడ్డు, జీఎస్‌టీ రోడ్డు సహా ఇతర ప్రాంతాల్లో బైక్ రేసులు అడ్డుకొనేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం, మద్యం తాగి వాహనాలు నడపడం తదితర చర్యలకు పాల్పడే వారిపై కఠినచర్యలు చేపట్టనున్నారు. ఇక, రద్దీలో చైన్ స్నాచింగ్, చోరీలు అడ్డుకొనేలా మఫ్టీ పోలీసులు పహారా కాస్తారని నగర పోలీసు శాఖ తెలిపింది.

బీజేపీవైపు నటి మీనా చూపు?

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సినీ నటి మీనా బీజేపీలో చేరనున్నారా?.. అందుకే ఆమెకు బీజేపీ అధిష్ఠాం తగిన ప్రాధాన్యం ఇస్తోందా?.. దీనిపై ఇప్పటికే ఇరువర్గాలు స్పష్టతకు వచ్చాయా?.. అవుననే అంటున్నాయి విశ్వసనీయవర్గాలు. ఇందులో భాగంగానే ఇటీవల కేంద్ర సమాచార, మత్స్య అభివృద్ధి, పశు సంవర్థక శాఖ మంత్రి ఎల్.మురుగన్ నిర్వహించిన పొంగల్ వేడుకలకు మీనాకు ఆహ్వానం అందిందని, అక్కడ కూడా కాషాయదళం ఎనలేని ప్రాధాన్యం ఇచ్చిందని తెలుస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో ఆది నుంచి సినీ ప్రముఖులదే కీలకపాత్ర అనడంలో ఎలాంటి సందేహం లేదు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి, దివంగత సీఎంలు ఎంజీఆర్, జయలలితతో పాటు ప్రస్తుతం ముఖ్యమంత్రి పీఠంపై ఉన్న స్టాలిన్ సైతం సినీ రంగం నుంచి వచ్చినవారే. అందుకే రాష్ట్ర రాజకీయాల్లో సినీవర్గాలకు తగిన ప్రాధాన్యం, గుర్తింపు ఉంది. కానీ ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో సినీ ప్రముఖుల సందడి తగ్గినట్లు కనిపిస్తోంది. అయితే బీజేపీ మాత్రం సినీ ప్రముఖులకు విరివిగా సభ్యత్వం ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఇంట్లో జరిగిన పొంగల్ వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ పెద్దలు హాజరైన విషయం తెలిసిందే. ఈ వేడుకల్లో సినీ నటి మీనా హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు. అంతేగాక ఆమెను మురుగన్ పలువురు అగ్రనేతలకు పరిచయం చేయడం కనిపించింది. ఒకరకంగా చెప్పాలంటే రాష్ట్రం నుంచి వెళ్లిన వారిలో మీనా ప్రత్యేక ఆకర్షణ నిలిచారు. ప్రధాని మోదీతో కలిసి పొంగల్ తయారీలోనూ పాల్గొన్నారు. ఆమె బీజేపీలో చేరనున్నారని, అందుకే ఆమెకు అంత ప్రాధాన్యత ఇచ్చారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎల్.మురుగన్ ఉన్నప్పుడు పలువురు సినీ ప్రముఖులు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు కూడా ఆయనే మీనాను పార్టీలో చేర్పించేందుకు సన్నాహాలు చేశారని తెలుస్తోంది. ఇందుకు మీనా కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.



పొంగల్ వేడుకల్లో ప్రధానితో మీనా తదితరులు

దక్షిణ చెన్నై నుంచి పోటీ?

'ఇండియా' కూటమిలో చేరనున్న 'మక్కల్ నీది మయ్యం' అధినేత, సీనియర్ నటుడు కమలహాసన్ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దక్షిణ చెన్నై నుంచి పోటీ చేసే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయనకు పోటీగా మీనాను బరిలోకి దింపాలని బీజేపీ నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. కమల్‌పై మీనా పోటీ చేస్తేనే అక్కడ గట్టిపోటీ ఇచ్చే అవకాశముందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీనికి తోడు దక్షిణ చెన్నైలో బీజేపీకి కొంతమేరకు పట్టుంది. అందుకే ఇక్కడి నుంచి మీనాను రంగంలోకి దింపాలని యోచిస్తున్నారని, ఇందుకు ఆమె కూడా చూచాయగా సరేనన్నట్లు బీజేపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే మీనా కుటుంబీకులు మాత్రం ఈ వ్యవహారాన్ని కొట్టి పారేస్తున్నారు. పొంగల్ వేడుకలకు ఆహ్వానం అందితేనే మీనా ఢిల్లీ వెళ్లారని, పార్టీలో చేరికకు సంబంధించి తమకెలాంటి సమాచారం లేదని వారు పేర్కొంటున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రంగవల్లులు.. పొంగళ్లు... క్రీడా ప్రదర్శనలు.. విన్యాసాలతో సందడి



రాష్ట్ర మంత్రి కన్నప్పన్‌కు సంప్రదాయబద్ధంగా కొత్త కరెన్సీ అందిస్తున్న సీఎం స్టాలిన్

ప్యారీస్, జనవరి 16: సంప్రదాయ పెద్ద పండుగ సంక్రాంతి శోభతో రాష్ట్రం వెల్లివిరిసింది. సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే ఘట్టాన్ని ఉత్తరాయణ పుణ్యకాలంగా భావిస్తూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామునే ప్రజలు అభ్యంగ స్నానాలాచరించారు. అలాగే, రైతులు చెరకు, వరి తదితరాలను సూర్యభగవానుడికి నైవేద్యంగా సమర్పించి ఈ సంవత్సరమంతా సుఖసంతోషాలు కలగాలని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఇక చిన్నారులు బొంగరాలు తిప్పుతూ, గాలిపటాలు ఎగురవేసి గ్రామీణ ప్రాంతాల్లో సందడి చేశారు. 12 తేదీ నుంచి మంగళవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎటుచూసినా సంక్రాంతి సందడి కనిపించింది. గతంలోలాగే గంగిరెద్దుల విన్యాసాలు, క్రీడాకారుల ప్రదర్శనలు, అతివల ముగ్గుల పోటీలు, కోడెద్దులు, గుర్రాలతో రేక్లా పందేలు సందడిగా సాగాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. మరోవైపు సంప్రదాయ సాహస క్రీడ జల్లికట్టు మైదానాల్లో కోడెద్దులు రంకెలేస్తూ పరుగులు తీశాయి. కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ తమ కుటుంబసభ్యులతో కలసి తమిళర్ తిరునాళ్‌ను పొంగల్‌గా జరుపుకున్నారు. ముందుగా గోపాలపురంలోని నివాసంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం తన సతీమణి దుర్గాతో కలసి మాతృమూర్తి దయాళు అమ్మ వద్ద ఆశీస్సులు పొందారు. ఆ తర్వాత క్యాంప్ కార్యాలయంలో పొంగల్ పర్వదినం సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ సీఎంను మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు, రాష్ట్ర మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, ఎస్.ముత్తుస్వామి, టీ.ఎం.అన్బరసన్, ఎస్.రఘుపతి, అనితా రాధాకృష్ణన్, పీకే శేఖర్‌బాబు సహా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రముఖులు సీఎం స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ స్టాలిన్ రూ.100 కొత్త కరెన్సీ అందజేశారు. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి రాజ్‌భవన్ ప్రాంగణంలో తన సతీమణితో కలసి కొత్త కుండలో పొంగల్ వండి సూర్యభగవానుడికి నివేదించారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితర నేతలు కూడా పొంగల్ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



బుల్లెట్‌పై మంత్రి ఉదయనిధి దంపతులు



సీఎం స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కనిమొళి



→ శాంథోమ్ చర్చిలో పొంగల్ వేడుకలు

సమత్తువ పొంగల్...

స్థానిక శాంథోమ్ చర్చి ప్రాంగణంలో మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన సమత్తువ పొంగల్ వేడుకల్లో బిషప్‌లు, ఫాదర్లు, హిందువులు, క్రైస్తవులు, ఇస్లామీయులు పాల్గొన్నారు. వేదిక ప్రాంగణంలో సంప్రదాయానికి అద్దం పడుతు కొత్త కుండల్లో మహిళలు పొంగలి పొంగించగా, యువకులు సంప్రదాయ వస్త్రధారణతో చెరుకు గడలు చేతబట్టి సందడి చేశారు.

పోలీసు కుటుంబాలతో...

తాంబరం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన పొంగల్ వేడుకల్లో రాష్ట్ర డీజీపీ శంకర్‌జివాల్ దంపతులు, తాంబరం పోలీస్ కమిషనర్ అమల్‌రాజ్, ఐటీ కన్నన్, డీఐజీ బెన్ని, చెంగల్పట్టు ఎస్పీ సాయిప్రణీత్ సహా పోలీసులు సంప్రదాయ వస్త్రధారణతో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.వివిధ పోటీల విజేతలకు డీజీపీ బహుమతులు అందజేశారు. అదే విధంగా పులియాన్‌తోపులోని పోలీసు క్వార్టర్స్‌లో జరుపుకున్న సమత్తువ పొంగల్ వేడుకల్లో అడిషినల్ కమిషర్ ఆర్షా కార్గ్, సహాయ కమిషనర్లు అళగేశన్, తమిళ్‌వానన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పశువుల పండగ...

పెద్ద పండుగలో మూడవదైన పశువుల (కనుమ) పండుగను మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తమ చేతికి పంట రావడానికి కష్టపడిన, సాయం చేసిన పశువుల పట్ల కృతజ్ఞతాపూర్వకంగా, ప్రేమగా రైతులు పశువులను భక్తిశ్రద్ధలతో పూజించారు. ఔషధాలు, వనమూలికలతో ఉప్పుతో దంచిన చెక్క, అవిశాకు, పళ్లను తినిపించారు. ఉదయాన్నే పశువులకు శుభ్రంగా స్నానం చేయించి, కొమ్ములకు తొడుగులు, మెడలో పూలమాలలు, ముత్యాల పట్టీలు, మూతికి మూజాంబరాలు తొడిగి అందంగా అలంకరించారు. అనంతరం పశువులను ఆలయాలకు తోలుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ పండుగ ప్రజలందరికీ కలిమి కలుగజేయాలని పూజలు చేశారు. ఇక, గోశాలల్లో పాలిచ్చే గోవులకు పసుపు కుంకుమలు దిద్ది, పౌష్టికాహారం తినిపించి పూజలు నిర్వహించారు.

తిరువళ్లువర్ చిత్రానికి కాషాయవస్త్రం

● గవర్నర్ సరికొత్త వివాదం! ● తిరువళ్లువర్‌కు రంగులు పులమడం భావ్యం కాదు ● ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తమిళులంతా పంచమవేదంగా భావించే తిరుక్కురళ్‌ను అందించిన తిరువళ్లువర్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి సరికొత్త వివాదానికి కేంద్రబిందువయ్యారు. ఆయన నివాళులర్పించిన తిరువళ్లువర్ విగ్రహానికి కాషాయవస్త్రం ధరింపజేయడమే ఇందుకు కారణమైంది. చలువరాయిలో చెక్కబడిన తిరువళ్లువర్ రూపానికి వస్త్రం చుట్టినట్లుగా ఉండడం లేదా ధవళ వస్త్రం కప్పివున్న తిరువళ్లువర్ రూపం మినహా, ఇతర రంగుల వస్త్రంతో వున్న తిరువళ్లువర్ ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు. అయితే మంగళవారం ఉదయం రామనాథపురంలో గవర్నర్ నివాళిలర్పించిన తిరువళ్లువర్ చిత్రపటంలో మాత్రం కాషాయవస్త్రం కప్పి వుంది. ఈ వ్యవహారమే ఇప్పుడు వివాదమైంది. తిరువళ్లువర్‌కు నివాళి అర్పించిన అనంతరం గవర్నర్ తన ఎక్స్ పేజీలో ఆ ఫొటోను పెట్టారు. అంతేగాక 'ఆధ్యాత్మిక భూమి తమిళనాట జన్మించిన తిరువళ్లువర్ భారతీయ సనాతన సంప్రదాయానికి చెందిన గొప్ప కవి, తత్త్వవేత్త. అద్భుతమైన ఆ సాధువుకు వినయపూర్వక ప్రణామాలు సమర్పించా. తిరువళ్లువర్ జ్ఞానం భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేసింది. మొత్తం మానవాళికి మార్గదర్శకంగా నిలిచిన ఆ మహాపురుషుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు' అంటూ సందేశం వెలువరించారు. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వెలువడగానే రాష్ట్రవ్యాప్తంగా పలువురు నిరసన తెలిపారు.



కాషాయవస్త్రం ధరించిన తిరువళ్లువర్ ఫొటో ఎదుట నిలిచి నమస్కరిస్తున్న గవర్నర్ రవి, ఆయన సతీమణి లక్ష్మీరవి

సీఎం స్టాలిన్ కౌంటర్...

తమిళసీమలో జన్మించి అందమైన తమిళంలో ధర్మాన్ని బోధించి సమస్త మానవాళికి హితోక్తులను అందించిన తిరువళ్లువర్‌పై ఎవరూ రంగులు పులమలేరని, మచ్చలు ఆపాదించలేరని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గవర్నర్ రవికి కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రజలకు తిరువళ్లువర్ జయంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఓ సందేశం వెలువరించారు. తిరువళ్లువర్ కీర్తిని నలుదిశలా చాటేలా 133 అడుగుల ఎత్తున్న విగ్రహాన్ని, ఆ మహాపురుషుడి పేరుతోనే నగరంలో వళ్లువర్ కోట్టంను నిర్మించామన్నారు. తిరుక్కురళ్ అందించిన బోధనలు హితోక్తులు, సామాజిక న్యాయ సూత్రాలే తమకు ఆచరణీయమని, ఆ మహాపురుషుడికి ఎవరూ ఎలాంటి రంగులను పులమలేరని పేర్కొన్నారు. స్టాలిన్ తన సందేశంతోపాటు తెలుపు దుస్తులు ధరించిన తిరువళ్లువర్ విగ్రహానికి మంత్రులు నివాళి అర్పిస్తున్న ఫొటో, కన్నియాకుమారిలో ఉన్న 133 అడుగుల విగ్రహం ఫొటోను జతచేశారు.

● ఎంజీఆర్, జయ కీర్తిని చాటేలా

◆ పార్టీ శ్రేణులకు ఈపీఎస్ పిలుపు

40 చోట్లా గెలిపించండి

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంజీఆర్, దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత కీర్తిని చాటేలా లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించేలా ఇప్పటి నుంచే పాటుపడాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా, బుధవారం ఎంజీఆర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈపీఎస్ మంగళవారం సాయంత్రం ఓ ప్రకటన జారీ చేశారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, ఈ వాస్తవాలను ప్రజలకు తెలిపే విస్తృత ప్రచారం సాగించాలని దిశా నిర్దేశం చేశారు. ఎంజీఆర్ అస్తమించి యేళ్లు దాటినా పేదల హృదయాల్లో ఇంకా చిరంజీవిగానే ఉన్నారని, ఇదే విధంగా మాజీ ముఖ్యమంత్రి జయలలిత నిరుపేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజానీకం ఇంకా మరువలేదన్నారు. ఆ ఇద్దరు నేతల అడుగుజాడల్లోనే తానూ నడుస్తూ పార్టీని విజయపథం వైపు తీసుకెళ్తున్నాని ఈపీఎస్ తెలిపారు. తమిళభాష ఔన్నత్యాన్ని చాటేందుకు ఎంజీఆర్ తంజావూరు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారని, అదే విధంగా బలహీనవర్గాలవారికి, గిరిజనులు లబ్ధి పొందేలా వారికి 69 శాతం రిజర్వేషన్లు కల్పించిందని జయలలితేనని కొనియాడారు. బుధవారం ఎంజీఆర్ జయంతి వేడుకల సందర్భంగా పార్టీ శ్రేణులంతా లోక్‌సభ ఎన్నికల్లో 40 నియోజకవర్గాల్లో పార్టీని గెలిపిస్తామంటూ తమకు తాముగా శపథం చేయాలన్నారు. తై మాసం వస్తే మార్గం సుగమ్యం అవుతుందన్న తమిళనానుడి ప్రకారం అన్నాడీఎంకేకు కూడా ఈ మాసం బంగారుబాటను చూపుతుందనే విశ్వసిస్తున్నామని తెలిపారు. పార్టీ శాసనసభ్యులు, జిల్లా నేతలు, పోలింగ్ బూత్ ఇన్‌చార్జులు కలిసికట్టుగా ఇప్పటి నుంచే పాటుపడితేనే లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించగలుగుతామన్నారు. డీఎంకే అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం సాగించాలని, ప్రజలు కూడా అన్నాడీఎంకేకు ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని మరువకూడదని ఈపీఎస్ గుర్తు చేశారు. ఇదిలా ఉండగా సేలంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ఈపీఎస్ ఎడ్లబండిని తోలుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.



పొంగల్ వేడుకల్లో ఎడ్లబండి తోలుతున్న ఈపీఎస్

సమాచార ధ్వని

రేపటి నుంచి ప్రాక్టికల్ శిక్షణ

ఐసిఎఫ్, జనవరి 16: ప్రాక్టికల్ శిక్షణ తరగతులు ఈనెల 18నుంచి ప్రారంభించాలని పాఠశాలలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర పాఠశాల విద్య పాఠ్య ప్రణాళికలో ప్లస్ టూ విద్యార్థులకు మార్చి 1 నుంచి 22వ తేది వరకు, ప్లస్ వన్‌కు మార్చి 4 నుంచి 25వ తేది వరకు, టెన్త్‌కు మార్చి 26 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. అలాగే, ప్లస్‌టూకు ఫిబ్రవరి 12 నుంచి 17 వరకు, అనంతరం ప్లస్‌వన్, టెన్త్ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. సంక్రాంతి సెలవులు ముగియగానే ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించి, విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని హెచ్‌ఎంలకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

శిథిలావస్థకు చేరుకున్న భవనాల వివరాలు తెలియజేయండి

ఐసిఎఫ్, జనవరి 16: పాఠశాలల్లో శిథిలావస్థకు చేరుకున్న భవనాల వివరాలు అప్‌లోడ్ చేయాలని ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ మహోన్నత, ఉన్నత, మాధ్యమిక, ప్రాథమిక పాఠశాలల్లో పాత తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర భవనాలను కూల్చివేసి కొత్త భవనాలు నిర్మిం చేం దుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఆయా పాఠశాలల్లో శిథిలావస్థలకు చేరుకున్న భవనాల వివరాలు తెలియ జేయాలని హెచ్‌ఎంలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

త్వరలో క్వారీల మూసివేత

ఐసిఎఫ్, జనవరి 16: రాష్ట్రవ్యాప్తంగా అనుమతి లేకుండా పనిచేస్తున్న క్వారీలను వారం రోజుల్లో మూసి వేయనున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. వివిధ జిల్లాల్లో ప్రభుత్వ అనుమతితో, అనుమతి లేకుంగా క్వారీలు పనిచేస్తున్నాయి. అనుమతి లేని క్వారీలను గుర్తించిన అధికారులు జలవనరుల శాఖకు నివేదిక అందజేశారు. ఆ ప్రకారం, త్వరలో ఆ క్వారీలు మూసి వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

మనలి - ఎన్నూర్ ప్రాంతాల్లో అభివృద్ధి పథకాలు

ఐసిఎఫ్, జనవరి 16: స్థానిక మనలి - ఎన్నూర్ ప్రాంతాల్లో నివసించే ప్రజల భద్రత, ఆరోగ్యం, జీవనాధార అభివృద్ధి కోసం కొత్త పథకాలను రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో ఉత్తర చెన్నై ప్రాంత అభివృద్ధి కోసం 'వడ చెన్నై వలర్చి దిట్టం' పేరుతో అభివృద్ధి పథకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా

ఐసిఎఫ్, జనవరి 16: మద్యం తాగి వాహనం నడిపే వారికి రూ.10 వేల జరిమానా విధించాలని డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంగ్ల సంవత్సరాది రోజున రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాలు జరగకుండా చర్యలు చేపట్టినట్లే పోలీసులు, పండుగ దినాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

28 మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు

ఐసిఎఫ్, జనవరి 16: తాంబరం కార్పొరేషన్‌లో 28 మెట్రిక్ టన్నుల చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించారు. తాంబరం పరిధిలో 513 మంది పర్మనెంట్, 1,625 మంది ఒప్పంద పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరు ప్రతిరోజు తడి, పొడి చెత్తను సేక రిస్తున్నారు. ఈ నేపథ్యంలో, భోగికి ముందు రోజు 28 మెట్రిక్ టన్నుల రబ్బరు, ప్లాస్టిక్ సహా పొడి చెత్తను సేక రించారు.

నగర జలాశయాల్లో 88 శాతం నీటినిల్వలు

పెరంబూర్, జనవరి 16: రాజధాని నగరం చెన్నై వాసు లకు సరఫరా చేసే జలాశయాల్లో 88.35 శాతం నీటి నిల్వలున్నాయి. చెంబరంబాక్కం జలాశయంలో 86,17 శాతం, పుళల్‌లో 87.09 శాతం, పూండిలో 95.48 శాతం, చోళవరం జలాశయంలో 73.17 శాతం, కన్నన్‌కోట చెరు వులో 99.2 శాతం అని ఐదు జలాశయాల్లో 88.35 శాతం నీరున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

అలల్లో చిక్కుకొని ఇద్దరి మృతి

ఐసిఎఫ్, జనవరి 16: స్థానిక ఇంజంబాక్కం తీరంలో సముద్ర అలల్లో చిక్కుకొని ఇద్దరు యువకులు మృతి చెందగా, ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వేళచ్చేరికి చెందిన మహేష్ (20), వరుణ్‌కుమార్ (28) మృతిచెందగా, రవి (23) ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారు నాణేలు స్వాధీనం

ఐసిఎఫ్, జనవరి 16: తిరుచ్చి విమానాశ్రయంలో రూ.76 లక్షల విలువైన బంగారు నాణేలు స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. కౌలాలంపూర్ నుంచి తిరుచ్చి విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికులను అధికారులు తనిఖీ చేశారు. ముగ్గురు లగేజీలు తనిఖీ చేయగా, తలా 40 గ్రాముల బరువున్న 30 బంగారు నాణేలను తరలించినట్లు తెలిసింది. వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు, ముగ్గుర్ని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

పర్యాటకులను ఆకట్టుకుంటున్న విమాన హోటల్



విమానంలో ఏర్పాటైన హోటల్

పెరంబూర్, జనవరి 16: సేలం జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం ఏర్కాడులో దేశంలోనే తొలిసారిగా విమానంలో హోటల్ ఏర్పాటైంది. ఈ హోటల్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సేలం జిల్లా ఏర్కాడులో సుమారు 300లకు పైగా విడిది గృహాలున్నాయి. వీటిలో పలురకాల రుచికరమైన వంటకాలతో హోటళ్లు పనిచేస్తున్నాయి. నూతన ప్రయత్నంగా ప్రైవేటుకు సొంతమైన హోటల్ ఒకటి విమానంలో ఏర్పాటైంది. ఒకరికి రూ.300 ఛార్జీతో శాఖాహార, మాంసాహార వంట కాలు అందజేస్తున్నారు. హోటల్ వంటకాలు రుచి చూడక పోయినా విమానం ముందు నిలబడి పర్యాటకులు సెల్ఫీ తీసుకుంటున్నారు. ప్రస్తుతం సెలవులు కావడంతో ఈ విమాన హోటల్ పర్యాటకులతో కిటకిటలా డు తుండగా, చాలామంది క్యూలో వేచి ఉండడం గమనార్హం.

ముల్లై పెరియార్ డ్యాం రూప శిల్పి బెన్నీక్విక్‌కు ఘననివాళి



బెన్నీక్విక్ విగ్రహానికి శాసనసభ్యులతో కలిసి నివాళి అర్పిస్తున్న మంత్రి ఐ.పెరియసామి, జిల్లా కలెక్టర్ షజీవనా

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తేని, దిండుగల్, మదురై సహా ఐదు జిల్లాలకు సాగు జలాలను అందించే ముల్లైపెరియార్ డ్యాంను నిర్మించిన ఆంగ్లేయ అధికారి కల్నల్ జాన్ బెన్నీక్విక్ జయంతి వేడుకలను తేని జిల్లావాసులు యేటా ఘనంగా జరుపుకుంటారు. ఈ మేరకు మంగళవారం ఉదయం బెన్నీక్విక్ 183వ జయంతి వేడుకలు లోయర్ క్యాంప్‌లోని ఆయన స్మారక మండపం వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మంత్రి ఐ.పెరియసామి, శాసనస భ్యులు రామకృష్ణన్, మహారాజన్, శరవణకుమార్, మాజీ శాసనసభ్యుడు తంగ తమిళ్‌సెల్వన్, కలెక్టర్ షజీవనా తదితరులు బెన్నీక్విక్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పెరియ సామి మాట్లాడుతూ... ప్రకృతి సౌందర్యాలకు నెలవుగా ఉన్న తేని జిల్లాలో పచ్చదనాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. తేని సహా ఐదు జిల్లాలకు సాగు జలాలను అందించేలా డ్యాంను నిర్మించిన బెన్నీక్విక్ సేవలను జిల్లా వాసులంతా కలకాలం గుర్తుంచుకోవాల న్నారు. ఈ వేడుకల్లో గూడలూరు నగర పంచాయతీ అధ్యక్షురాలు పద్మావతి, డీఎంకే నగర కార్యదర్శి లోకన్‌దురై తదితరులు పాల్గొన్నా రు.

ఓపీఎస్ నివాళి....

మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం నాయకత్వంలో ఆయన అనుచరులు కూడా బెన్నీక్విక్ విగ్రహానికి నివాళి అర్పించారు. అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు జక్కయ్యన్, మురుకోటై రామర్, గూడలూరు నగర పంచాయతీ మాజీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తదితరులు బెన్నీక్విక్‌కు అంజలి ఘటించారు. వివిధ రైతు సంఘాల నాయకులు, సభ్యులు కూడా బెన్నీక్విక్‌కు పూలమాలలతో నివాళి అర్పించేందుకు విగ్రహం వద్ద బారులు తీరారు. ఇక పాలార్ పట్టిలో బెన్నీక్విక్ జయంతి సందర్భంగా మహిళలు పొంగళ్లు పెట్టి, ఆయన విగ్రహం వద్ద నైవేద్యంగా సమర్పించారు. ఆ సందర్భంగా యువతీ యువకులకు టగ్ ఆఫ్ వార్, ఉట్టి పోటీ, సిలంబాట్టం వంటి పోటీలు నిర్వహించారు. ఇక జానపద కళాకారుల మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన తబ్బాట్టం, దేవరాట్టం, గరగాట్టం, కిళవన్‌కెళవి, మాడాట్టమ్ తదితర గ్రామీణ నృత్య ప్రదర్శనలు అలరించాయి.

రామేశ్వరం ఆలయంలో గవర్నర్ ప్రత్యేక పూజలు



రామనాథస్వామిని దర్శించుకుంటున్న గవర్నర్ దంపతులు

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి సతీస మే తంగా రామనాథపురం జిల్లా రామేశ్వరం ఆలయాన్ని సందర్శించారు. ఈ సంద ర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆయన చెన్నై నుంచి విమానంలో బయలుదేరి మదురై విమానాశ్రయం చేరుకున్నారు. మదురై కలెక్టర్ సంగీత ఇతర అధికారులు ఆయ నకు స్వాగతం పలికారు. ఆ తర్వాత గవర్నర్ కారులో బయలుదేరి రామేశ్వరం చేరుకున్నారు. రామనాథపురం జిల్లా కలెక్టర్ విష్ణుచంద్రన్ ఇతర అధికా రులు గవర్నర్‌కు సాదర స్వాగతం పలికారు. ఆటు పిమ్మట తిరుపుల్లానిలో రామా యణ గాథకు సంబంధించి ఆదిజగన్నాథ పెరుమాళ్ ఆల యాన్ని గవర్నర్ రవి, ఆయన సతీమణి లక్ష్మీ రవి దర్శించారు. ఆ తర్వాత అక్కడి నుండి బయలు దేరి రామేశ్వరం ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు, అధికారులు గవర్నర్ దంపతులకు పూర్ణ కుంభ మర్యాదలతో స్వాగతం పలికారు. రామనాథస్వామివారిని, పర్వతవర్థిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు గవర్నర్ దంపతులకు ప్రసాదాలను అందజేశారు.

ముగిసిన ధనుర్మాస పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



గోదా దేవికి మహా హారతి

ప్యారీస్, జనవరి 16: స్థానిక కొడుంగైయూర్ వెంకటేశ్వర నగర్ సిద్ధి వినాయక శ్రీనివాస వేంకట ముడయాన్ తిరుకోవిల్ సేవార్థిగళ్ సంఘం ఆధ్వర్యంలో నెలరోజుల పాటు వైభవంగా నిర్వహించిన ధనుర్మాస ముగింపు పూజలు ఆదివారం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా మరక సంక్రాంతి వేడుకలను ఈ ఆలయంలో సోమవారం కోలాహలంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శబరిమలలోలాగే ఆలయ ప్రవేశద్వారం వద్ద అఖండ జ్యోతి వెలిగించారు. ఆండాళ్ తిరుకల్యాణం, మకర సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి తోరణాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళ హారతి, ప్రసాదాలు వినియోగించారు. ఈ పూజలు సేవార్థిగళ్ సంఘం అధ్యక్షుడు బోడి శ్రీనివాసులు సారథ్యంలో ఘనంగా జరిగాయి.

ఎన్నికల సమయంలోనే కూటమిపై నిర్ణయం

● మంత్రి దురైమురుగన్

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఏయే పార్టీలతో పొత్తు కుదుర్చుకుని కూటమిని ఖరారు చేసే విషయంపై నోటిఫికేషన్ జారీ అయిన తరువాతే పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ తెలిపారు. వేలూరు జిల్లా కాట్పాడి వద్ద పార్టీ శ్రేణులతో కలిసి సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడే కాకుండా, ప్రస్తుతం కర్ణాటకలో తమ పార్టీ మిత్రపక్షమైన కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నా కావేరి జలాలు సక్రమంగా అందలేదని చెప్పారు. బీజేపీ నేత అన్నామలై డీఎంకే ఫైల్స్ అంటూ అసత్య ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శిం చారు.

రామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మ్యాథ్స్‌పై ఉచిత శిక్షణ

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రైసింగ్ ఎ మ్యాథమెటీషియన్ (రామ్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు గణితశాస్త్రంపై వారం రోజుల పాటు ఉచిత శిక్షణను ఇవ్వనున్నారు. మే 15 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించేశిక్షణకు దేశవ్యాప్తంగా ఎంపికయ్యే 100 మంది అభ్యర్థులకు ఉచిత బసతోపాటు గణిత పరికరాలను అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణ పొందదలచిన విద్యార్థులు ఈనెల 31లోపున దరఖాస్తులను పంపాలని పేర్కొన్నారు. వివరాలు పొందటానికి www.raisingamathemati cian. comలో గానీ, నెం.9987375773లో సంప్రదించవచ్చు

హోం కేర్ సిబ్బందికి ప్రశంస

వేలూరు, జనవరి 16: స్థానిక సత్తువాచ్చేరిలోని హోం కేర్ నర్సింగ్ మెడికల్స్ సేవా స్థాపకంలో వార్షికోత్సవం మంగళవారం జరిగింది. కార్యక్ర మానికి ఆల్బియస్ జయచంద్రన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా డాక్టర్ సాప్‌సిరామ్, సమాజ సేవకుడు కాంగ్రెస్ కమిటీ ఓబీసీ శాఖ వేలూరు కార్పొరేషన్ జిల్లా సెక్రటరీ నోబుల్ విల్లింగ్టన్, డాక్టర్ సామ్ దినకరన్, నరసింహన్ పాల్గొని, ఉత్తమ సేవలందిస్తున్న కేర్ సిబ్బంది, నిర్వాహకులను అభినందించి బహుమతులు అందజేశారు.

మెల్విన్ జోన్స్‌కు ఘన నివాళి

వేలూరు, జనవరి 16: విదేశీ లయన్స్ సంఘ స్థాపకుడు మెల్విన్ జోన్స్ 145వ జయంతి మంగళవారం నిర్వహించారు. స్థానిక పాలారు మా నగర లయన్స్ సంఘం తరపున నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళి అర్పించిన అనంతరం అన్నదానం చేశారు. లయన్ కామరాజ్, వేలూరు మా నగర లయన్స్ సంఘం ఎయిల్, అధ్యక్షుడు లయన్ మురుగన్, సేవా అధ్యక్షుడు కన్నన్ సహా పలువురు పాల్గొన్నారు.



తిరువళ్లువర్ దినోత్సవం సందర్భంగా వళ్లువర్‌కోట్టమ్‌లోని ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రులు స్వామినాథన్, ఎం. సుబ్రమణ్యం, మేయర్ ఆర్ ప్రియ తదితరులు

నేరాలకు పాల్పడబోమంటూ పాత నేరస్తుల ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న పాత నేరస్తులు

వేలూరు, జనవరి 16: నేరాలకు పాల్పడబోమంటూ పాత నేరస్తుల చేత పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. వేలూరు డివిజన్ డీఐజీగా సరోజ్‌కుమార్ ఠాగూర్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. డివిజన్‌లో అరాచకాలు అడ్డుకొని ప్రజలు ప్రశాంతంగా జీవించేలా చర్యలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా డీఐజీ తెలిపారు. ఈ చర్యల్లో డివిజన్ పరిధిలోని పాత నేరస్తులను స్టేషన్‌కు పిలిపించి, వారు నేరాలకు పాల్పడబోమంటూ ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీ తిరునావుక్కరసు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో 50 మందికి పైగా పాత నేరస్తులు పాల్గొన్నారు.

మహిళా ఖైదీకి సాయం



వేలూరు, జనవరి 16: దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై 115వ జయంతి సందర్భంగా వేలూరు మహిళా ఖైదీ జైలు నుంచి విడుదలైన మహిళా ఖైదీకి తమిళనాడు ఖైదీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెలకు సరిపడా బియ్యం, పప్పులు సహా 21 రకాల సరుకులు అందజేశారు. కార్యక్రమానికి సంఘం వేలూరు ఉపాధ్యక్షుడు, న్యాయవాది విజయరాఘవులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మహిళా ఖైదీ జైలులో పనిచేసి నందుకు ఇచ్చిన వేతనాన్ని తిరువణ్ణామలై జిల్లా పోలూరు డివిజన్‌కు చెందిన ధనలక్ష్మి (43)కి జైలు సూపరింటెండెంట్ అబ్దుల్ రెహ్మాన్ అందజేశారు. కార్యక్రమంలో జైలు అధికారి నీలామణి, రెడ్‌క్రాస్ సంఘం సెక్రటరీ జనార్దనన్ తదితరులు పాల్గొన్నారు.

ఊటీలో పర్యాటకుల సందడి



చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక నగరం ఊటీలో మూడు రోజులుగా పర్యాటకుల రాక విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం ఊటీలో చల్లటి వాతావరణం నెలకొంది. రాత్రి నుంచి ఉదయం 9 గంటల దాకా మంచు అలముకుంటోంది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో రాష్ట్ర నలమూలల నుంచి పర్యాటకులు ఊటీకి విహారయాత్రగా వెళ్తున్నారు. ఏప్రిల్, మేలో వేసవిలో ఫల పుష్ప ప్రదర్శనలను నిర్వహించేందుకు అక్కడి ఉద్యానవనాల్లో వివిధ రకాల పూలచెట్లను పెంచుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల పూల కుండీల్లో పెంచుతున్న చెట్లన్నీ రంగు రంగుల పుష్పాలతో కళకళలాడుతున్నాయి. వాటితో సెల్ఫీలు తీసుకుంటు న్నారు. పర్యాటకులు బొటానికల్ పార్కు, కున్నూరు సిమ్స్ పార్కు, కోత్తగిరి నెహ్రూ పార్కు, ముదుమలై పులుల అభయారణ్యం, పైక్రా జలపాతం, పైక్రా బోట్‌హౌస్, ఊటీ బోట్‌హౌస్, రోజ్ గార్డెన్‌లల్లో సందడి చేస్తున్నారు. రెండు రోజుల్లో నీలగిరి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను 49 వేలమంది పర్యాటకులు సందర్శించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఊటీ కొండకు అదనపు రైలు సర్వీసులు

పెరంబూర్, జనవరి 16: పర్యాటకుల కోసం ఊటీ కొండ రైలు సేవలు పెంచినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవులు కావడంతో నీలగిరి జిల్లా ఊటీకి వస్తున్న పర్యాటకులు అధికంగా కొండ రైలులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోమవారం కున్నూర్ - ఊటీ మధ్య నాలుగు సార్లు నడిపిన కొండ రైళ్లలోని ఐదు బోగీల్లో 300 మంది ప్రయాణించారు. మేట్టుపాళయం-ఊటీ మధ్య ఒకసారి మాత్రమే నడుపుతున్న కొండ రైలులో 210 మంది ప్రయాణించారు. అదే సమయంలో మేట్టుపాళయం నుంచి కున్నూర్‌కు మూడు బోగీలతో రైలు నడుపుతున్న రైలుకు కున్నూర్‌లో అదనంగా మరో రెండు బోగీలు అనుసంధానం చేశారు. ఈ నెల 21, 26, 28 తేదీలు, మేట్టుపాళయం నుంచి ఊటీకి 18, 25 తేదీల్లో ప్రత్యేక కొండ రైలు సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

పంచెకట్టు, చెరకు గడతో పొంగల్ వేడుకల్లో అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్





వేలూరు కాట్పాడి సమీపంలోని చిత్తూరు బస్టాండ్‌లో మంగళవారం దివంగత డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ చిత్రపటానికి పూలుచల్లి నివాళి అర్పిస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు



చెన్నై వెంకటనారాయణ రోడ్డులోని టీటీడీ ఆలయంలో రామజన్మభూమి క్షేత్ర ప్రాణప్రతిష్ఠ వేడుకల్లో మంగళవారం సాయంత్రం గాత్రకచేరి చేసిన ఉత్తర ఉన్నికృష్ణన్ బృందాన్ని సత్కరిస్తున్న స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు

రేపు డీఎంకే యువజన మహానాడు జ్యోతి యాత్ర

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సేలంలో ఈనెల 21న జరగనున్న డీఎంకే యువజన విభాగం ద్వితీయ మహానాడు జ్యోతియాత్ర ఈనెల 18న వేప్పేరిలోని పెరియార్ తిడల్ నుంచి ప్రారంభం కానుంది. ఈ జ్యోతియాత్రను దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించనున్నారు. ఈ యాత్ర అన్నా అరివాలయం, అన్నగం, సైదాపేట, గిండి, కత్తిపారా, ఆలందూరు మెట్రో, ఎయిర్ పోర్టు, పల్లావరం, తాంబరం, పెరంగళత్తూరు, వండలూరు, సింగపెరుమాళ్‌కోవిల్, చెంగల్పట్టు, మదురాంతకం, మేల్‌మరువత్తూరు, అచ్చిరపాక్కం, దిండివనం, మయిలం, విక్కవాండి, విల్లుపురం, అరచూరు, ఉలుందూరుపేట, త్యాగదుర్గం, కళ్లకురిచ్చి, చిన్న సేలం, తైలవాసల్, ఆత్తూరు మీదుగా మహానాడు జరుగనున్న పెద్దనాయకన్‌పాళయం చేరుతుందని మంత్రి శేఖర్‌బాబు ప్రకటించారు.

ఎల్లుండినుంచి పళని తైపూస ఉత్సవాలు

ఐసిఎఫ్, జనవరి 16: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయంలో తైపూస ఉత్సవాలు ఈనెల 19వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. 10 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు పెరియనాయకి అమ్మన్ ఆలయంలో వినాయక పూజ, ముత్తుకుమారస్వామి వల్లీదేవసేన అభిషేకం, అలంకరణ, కంకణధారణ జరుగనున్నాయి. అనంతరం ధ్వజస్తంభ పూజ, ఉదయం 7.30 గంటలకు ధ్వజారోహణం, మధ్యాహ్నం 12 గంటలకు పైగా ఉచ్చికాల పూజ, కొండపై ఉన్న వినాయక, మూలవిరాట్టు, షణ్ముగ, ఉత్సవ, ద్వార పాలకుల కంకణధారణ కార్యక్రమాలు జరగనున్నాయి. తైపూస ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజు ఉదయం దంత పల్లకిలో ముత్తుకుమారస్వామి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7.30 గంటలకు రజత మేషం, కామధేను సహా స్వర్ణ నెమలి వాహనాల్లో దర్శనమిస్తారు. 24వ తేది సాయంత్రం 7.30 గంటలకు పైగా వల్లీ దేవసేన సమేత ముత్తుకుమారస్వామి తిరుకల్యాణం, రాత్రి 9 గంటలకు వెండి రథంపై స్వామివారి ఊరేగింపు, 25వ తేది వేకువజామున షణ్ముగ నదిలో తీర్థవారి జరగనున్నాయి. అనంతరం 11 గంటలకు పెరియనాయకి అమ్మన్ ఆలయంలో ముత్తుకుమార స్వామి, వల్లీదేవసేన సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు రథోత్సవం జరగనుంది. 28వ తేది తెప్పోత్సవంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు చెప్పారు.

చెన్నైని కప్పేసిన పొగమంచు

● 88 విమాన సర్వీసులకు అంతరాయం

అడయార్, జనవరి 16: చెన్నై నగరాన్ని పొగమంచు కమ్మేసింది. దీంతో 88 విమాన సర్వీసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 12 విమాన సర్వీసులు ల్యాండింగ్ చేయలేక పోయారు. దీంతో ఆ విమాన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భోగి పండుగతో పాటు సోమవారం కూడా ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. సోమవారం ఉదయం 7 నుంచి 9 గంటల ప్రాంతంలో పొగమంచు నగరాన్ని దట్టంగా కమ్మేసింది. విమానాశ్రయం దగ్గర కూడా ఇదే పరిస్థితి. దీంతో లండన్, సింగపూర్, కౌలాలంపూర్, కొలంబో, కువైట్, మస్కట్, ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబై, పుణె, సెంగాడు ప్రాంతాలకు వెళ్లే 12 విమాన సర్వీసులను హైదరాబాద్, బెంగళూరు, తిరువనంతపురం, తిరుచ్చి, కోయంబత్తూరు విమానాశ్రయాలకు దారి మళ్లించారు. ఇదేవిధంగా దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి చెన్నైకి రావాల్సిన దాదాపు 40కు పైగా విమాన సర్వీసులు కొన్ని గంటల పాటు ఆలస్యంగా వచ్చాయి. ఢిల్లీ, ముంబై, శ్రీలంకకు నడిపే 8 విమానాలను సోమవారం రద్దు చేశారు.

పుష్కరకాలం తర్వాత రేక్లా పోటీలు

అడయార్, జనవరి 16: నామక్కల్ జిల్లాలో పుష్కర కాలం (12 యేళ్ళ) తర్వాత గుర్రపు రేక్లా పోటీలను నిర్వహించారు. రాష్ట్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖల మంత్రి ఉదయనిధి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని జిల్లాలోని నామ్‌గిరిపేటలో ఈ పోటీలనునిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 57 మంది గుర్రపు పోటీదారులు పాల్గొన్నారు. చిన్న, పెద్ద, కొత్త గుర్రం ఇలా మూడు విభాగాలుగా విభజించి 8, 10, 12 మైళ్ల దూరం పోటీలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రామస్వామి జెండా ఊపి ప్రారంభించారు. చిన్న గుర్రాలు అమిత వేగంతో పరుగులు పెట్టాయి. అలాగే, పెద్ద గుర్రాల విభాగంలో కోయంబత్తూరుకు చెందిన గుర్రం మొదటి బహుమతి, రెండో బహుమతిని సేలంకు చెందిన గుర్రం గెలుచుకుంది. చిన్న గుర్రాల విభాగంలో తొలి బహుమతిని భవానీసాగర్‌కు చెందిన గుర్రం గెలుచుకుంది. విజేతలకు నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. రాశీపురం డీఎస్పీ విజయకుమార్ సారథ్యంలో భద్రతను కల్పించారు.

రైలు నుంచి కిందపడి ఐటీ ఉద్యోగి మృతి

అడయార్, జనవరి 16: రామేశ్వరం నుంచి చెన్నైకు సేతు ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్న ఐటీ ఉద్యోగి ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడటంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని నగర శివారు ప్రాంతమైన కొలప్పాక్కంకు చెందిన సుందరపాండ్యన్ (42)గా గుర్తించారు. ఈయన ఒక ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన వ్యక్తిగత పనిమీద చెన్నై నుంచి రామేశ్వరం వెళ్లి సోమవారం సేతు ఎక్స్‌ప్రెస్‌లో చెన్నైకు వస్తుండగా, ఉళుందూరుపేట వండిపాళెయం వద్ద ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుందరపాండ్యన్ అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విరుదాచలం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

10 మంది జాలర్ల నిర్బంధం

అడయార్, జనవరి 16: భారత సముద్ర జలాల సరిహద్దులను దాటారన్న నెపంతో నాగపట్టినంకు చెందిన పదిమంది జాలర్లను శ్రీలంక నౌకాదళం నిర్బంధించింది. నాగై జిల్లా అక్కరైపేటకు చెందిన ధర్మబాలన్‌కు చెందిన మరబోటులో ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో 10 మంది చేపలవేటకు వెళ్లారు. వీరంతా కొడికరైకు దక్షిణ ప్రాంతంలో చేపల వేట కొనసాగిస్తుండగా, అక్కడికి వచ్చిన లంక నౌకాదళం... సరిహద్దులను దాటి తమ సముద్ర జలాల్లోకి ప్రవేశించారన్న సాకుతో జాలర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ జాలర్లను వదిలిపెట్టేలా లంక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకునిరావాలని భారత విదేశాంగ అధికారులను కోరింది.

ఎగ్జిబిషన్‌కు క్యూ కట్టిన నగరవాసులు

అడయార్, జనవరి 16: స్థానిక ఐల్యాండ్ మైదానంలో జరుగుతున్న 48వ పర్యాటక ప్రదర్శనను తిలకించేందుకు సంక్రాంతి పండుగ రోజున ఏకంగా 28,448 మంది నగరవాసులు వచ్చినట్టు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. యేటా సంక్రాంతి పండుగకు ముందుకు టూరిజం శాఖ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తుంది. 48వ టూరిస్ట్ ఎగ్జిబిషన్ ఈనెల 14న ఆదివారం ప్రారంభమైంది. కేంద్రప్రభుత్వానికి చెందిన రెండు స్టాళ్లు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 49 స్టాళ్లు ఈ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరాయి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అన్ని మంత్రిత్వ శాఖలకు చెందిన స్టాళ్లు ఏర్పాటు చేయడం గమనార్హం. అలాగే, చిన్నారులు, పెద్దల వినోదాలను అందించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం సంక్రాంతి పండుగ రోజున ఏకంగా 28,448 మంది పర్యాటకులు వచ్చినట్టు ప్రభుత్వ అధికారులు వెల్లడించారు.

శ్రీరంగనాథుడి ఆలయంలో తై తేర్ తిరువిళా

అడయార్, జనవరి 16: తిరుచ్చి జిల్లా శ్రీరంగం రంగనాథుడి ఆలయంలో తైతేర్ తిరువిళా మంగళవారం వేకువజామున పతాకావిష్కరణతో ప్రారంభమైంది. ఈ వేడుకల్లో భాగంగా కీలక ఘట్టమైన రథోత్సవం ఈనెల 24న జరగనుంది. ఈ యేడాది తైతేర్ వేడుకల ప్రారంభోత్సవంలో భాగంగా వేకువజామున 2.45 గంటలకు నమ్ పెరుమాళ్ మూలస్థానం నుంచి బయలుదేరి 3 గంటల సమయంలో ధ్వజారోహణ మండపానికి వేంచేయగా, ఆ తర్వాత తెల్లవారుజామున 4.45 గంటలకు పతాకావిష్కరణ చేశారు. ఉదయం 6.15 గంటలకు నమ్ పెరుమాళ్ అద్దాల మందిరంలోకి ప్రవేశించారు. ఈ వేడుకలు ఈ నెల 26వ తేదీ వరకు జరుగుతాయి.

ముగిసిన ఈశాన్య రుతుపవనాల సీజన్

ఐసిఎఫ్, జనవరి 16: మూడునెలలుగా కొనసాగిన ఈశాన్య రుతు పవన వర్షాల సీజన్ ఈనెల 14న వతేది ఆదివారంతో ముగిసింది. అక్టోబరులో ప్రారంభమైన ఈశాన్య రుతుపవనాలు జనవరి వరకు కొనసాగుతుంటాయి. ఈశాన్య రుతు పవనాల ప్రభావంతో రాష్ట్రంలో భారీవర్షాలు కురిశాయి. చెన్నై సహా ఉత్తర జిల్లాల్లో భారీ వర్షం, దక్షిణ జిల్లాలో అతిభారీ వర్షాలు కురిశాయి. తమిళనాడు, పుదుచ్చేరిలో అన్ని జలాశయాలను నింపిన ఈ వర్షాలు ఈనెల 14వ తేదీతో ముగిశాయని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం వెల్లడించింది. రాబోయే రోజుల్లో రాత్రి, వేకువ జాముల్లో దట్టమైన మంచు, పగలు పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ కేంద్ర డైరెక్టర్ సెందామరై కన్నన్ తెలిపారు.

తారల ఇంట సంక్రాంతి సందడి











తల్లిదండ్రులు, ఇద్దరు కుమారులతో హీరో ధనుష్ - ఏలియన్ రెప్లికాతో శివకార్తికేయన్ ఫ్యామిలీ - జయం రవి సంక్రాంతి వేడుకలు - హరీష్ కల్యాణ్ పొంగల్ తయారీ - కొత్త కుండతో హీరోయిన్ భవ్య

రంకేసిన పోట్లగిత్త

పాలమేడు



యువకుడి బారి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న ఎద్దు



ఎద్దును అణచివేస్తున్న యువకుడు



పరుగులు తీస్తున్న ఎద్దు



పట్టు చిక్కకుండా యువకులను కుమ్ముతున్న ఎద్దు

- పాలమేడు, అవనియాపురం జల్లికట్టులో ఉరకలేసిన ఉత్సాహం
- పరుగులు తీసిన 1000 ఎద్దులు
- పట్టుకోసం 700 మంది యువకుల ప్రయత్నం
- 14 ఎద్దులను అణచి కారు గెల్చుకున్న ప్రభాకరన్

అవనియాపురం....



పరుగులు తీస్తున్న ఎద్దు వేగాన్ని అదుపు చేస్తున్న యువకుడు



ఎద్దును అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న యువకులు



యువకుల గుంపునుండి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న ఎద్దు

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా పాలమేడు జల్లికట్టు వాడివాసల్ మైదానం మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా పరుగులు తీసిన ఎద్దులు వేసిన రంకెలు, వాటిని అణచివేసేందుకు ప్రయత్నించిన యువకులు, గుమికూడిన జనాలు పెట్టిన కేకలతో దద్దరిల్లింది. యేటా సంక్రాంతి వచ్చిందంటే మదురై జిల్లావాసులు, యువ క్రీడాకారులు జల్లికట్టు క్రీడలు ఎప్పుడు జరుగుతాయా అంటూ ఎదురుచూస్తుంటారు. యేడాది పొడవునా కన్నబిడ్డల్లా పెంచుతున్న ఎద్దులను జల్లికట్టుకు సిద్ధం చేస్తూ ఓ వైపు వాటి యజమానులు, కొమ్ములు తిరిగిన ఆ ఎద్దులను అణచి బహుమతుల పంట పండించుకుందామా అంటూ కోడెకారు కుర్రాళ్లు తహతహలాడుతుంటారన్నది అతిశయోక్తి కాదు. సంక్రాంతి రోజునే మదురై జిల్లా అవని



పరుగులు తీస్తున్న ఎద్దు మోపునుపట్టుకున్న యువకుడు

యాపురంలో అట్టహాసంగా జల్లికట్టు క్రీడను నిర్వహించారు. ఆ క్రీడలో 825 ఎద్దులు పాల్గొన్నాయి. వెయ్యి మంది దాకా యువకులు వాటిని అణచివేసేందుకు ప్రయత్నించారు. 51 మంది దాకా గాయపడ్డారు. ఆ క్రీడలో అవనియాపురానికి చెందిన కార్తీక్ అనే యువకుడు కారును బహుమతిగా గెలుచుకున్నారు. ఆ యువకుడు ముచ్చటగా మూడోసారి బహుమతి పొందటం మరీ విశేషం.

నియమ నిబంధనల నడుమ...

మంగళవారం పాలమేడు జల్లికట్టు పకడ్బందీ ఏర్పాట్ల నడుమ, ప్రభుత్వ నియమ నిబంధనల నడుమ ప్రారంభమైంది. ఉదయం ఏడు గంటలకు జల్లికట్టు క్రీడాకారుల చేత జిల్లా కలెక్టర్ సంగీత జంతు నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. మంత్రి మూర్తి జెండా ఊపి ఈ పోటీని ప్రారంభించారు. ఈ పోటీలు 15 రౌండ్ల చొప్పున సాయంత్రం ఐదు గంటల దాకా అత్యంత ఉత్సాహంగా



అవనియాపురం విజేత కార్తీక్‌కు మొదటి బహుమతిగా లభించిన కారు

కొనసాగింది. మొదట వాడివాసల్ నుంచి ఆలయ ఎద్దులను విడిచిపెట్టారు. ఆ ఎద్దుల జోలికి యువకులు వెళ్ళకుండా వాటిని మైదానంలో పరుగులు తీయించారు. ఆ తర్వాత 108 ఎద్దులను విడిచారు. వాటిని అణచివేయడానికి 50 మంది యువకులు ప్రయత్నించారు. ఇదే రీతిలో ప్రతి రౌండ్‌కు 100 ఎద్దుల తక్కువ కాకుండా విడిచారు. ఈ జల్లికట్టులో నిబంధనలు అతిక్రమించిన ఏడుగురిని అనర్హులుగా ప్రకటించారు. మొదటి రౌండ్‌లో తమిళరసన్, రాజా, అజిత్ అనే యువకులు మూడు ఎద్దులను అణచారు. ప్రతి రౌండ్‌లోను ఎద్దుల వాడివాసల్ ఇరువైపులా నిలిచిన యువకులను కొమ్ములతో పొడిచేలా రంకెలు వేసుకుంటూ మైదానం వైపు పరుగులు తీశారు. ఈ పోటీలలో యువకుల అణచివేతను తప్పించుకున్న ఎద్దుల యజమానులకు బహుమతులు పంపిణీ చేశారు. అదే విధంగా ఎద్దులను అణచిన యువకులకు బీరువాలు, మంచాలు, మోటారు బైకులు, ఎల్ఈడీ టీవీలు, వాషింగ్ మెషిన్లు, బంగారు కాసులు, సైకిళ్లను బహుమతులుగా అందజేశారు. ఇక ఈ పోటీలో 14 ఎద్దులను అణచి విజేతగా నిలిచిన ప్రభాకరన్ అనే యువకుడికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తరఫున కారును మంత్రి మూర్తి బహుమతిగా అందజేశారు.

డీఎస్పీ సహా 46 మందికి గాయాలు..

పాలమేడు జల్లికట్టులో ఎద్దులు పొడవటంతో డీఎస్పీ విజయరాజన్ సహా 46 మంది గాయపడ్డారు. వీరిలో 16 మంది ఎద్దులను అణచివేసేందుకు ప్రయత్నించిన వీరులు కాగా, మరో పదిమంది ఎద్దుల యజమానులు, 17 మంది ప్రేక్షకులు, ముగ్గురు పోలీసులు. వీరందరిని చికిత్స కోసం అంబులెన్స్ ద్వారా మదురై రాజాజీ ఆసుపత్రికి తరలించారు.

అవనియాపురం జల్లికట్టు....

మదురై జిల్లా అవనియాపురంలో సోమవారం ఉదయం నిర్వహించిన జల్లికట్టు ఆద్యంతం ఆసక్తికరంగా ప్రేక్షకులకు గగుర్పాటు కలిగించేలా కొనసాగింది. కలెక్టర్ సంగీత క్రీడాకారుల చేత జంతు హింస నిరోధక ప్రతిజ్ఞ చేయించిన తర్వాత మంత్రులు మూర్తి, పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ జెండా ఊపి క్రీడను ప్రారంభించారు. 12 రౌండ్లుగా సాగిన ఈ జల్లికట్టులో 825 ఎద్దులు, 600 మంది యువకులు పాల్గొన్నారు. ఈ పోటీలో కుమార్ అనే యువకుడిన ఎద్దు పొడవటంతో అతడి కడుపులోని పేగులు బయటపడ్డాయి. ఇదే విధంగా మరో ఎద్దు పొడవడంతో శివప్రకాశం అనే యువకుడి గుండెకు గాయమైంది. ఇరువురిని చికిత్స నిమిత్తం మదురై రాజాజీ ఆసుపత్రికి తరలించారు. దీనితో అరగంట వరకు పోటీని నిలిపివేశారు. ఈ పోటీలలో యువకులు, ఎద్దులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కొన్ని ఎద్దులు వాడివవాసల్ నుంచి బయటకు రావటానికి జంకాయి. మరికొన్ని ఎద్దులు యజమానులు తాడు తీసిన వెంటనే రాకెట్ వేగంతో యువకుల వైపు దూసుకెళ్ళాయి. ఇంకొన్ని ఎద్దులు అటు యువకులకు చిక్కకుండా అటు మైదానం కేసి పరుగెత్తకుండా మైదానంలో పరచిన నారలను కొమ్ములతో పైకెత్తి విసిరి కొట్టాయి. ఈ పోటీల్లో ఎస్ఐ, కానిస్టేబుల్, ఇద్దరు ప్రేక్షకులు, 11 మంది యజమానులు సహా 51 మంది గాయపడ్డారు. చివరకు ఈ పోటీల్లో కార్తీక్ అనే యువకుడి కారును మొదటి బహుమతిగా గెలుచుకున్నాడు.



వాడివాసల్ వద్ద ఎగురుతున్న ఎద్దు



చడీచప్పుడు లేకుండా వాడివాసల్ వద్దే యువకుడి చేతికి చిక్కిన ఎద్దు



పాలమేడు జల్లికట్టులో వాడివాసల్ వద్దే ఎద్దును అణచేందుకు ప్రయత్నిస్తున్న యువకులు



ముగ్గురు యువకుల బారి నుండి తప్పించుకుంటున్న ఎద్దు



అవనియాపురం జల్లికట్టులో ఇద్దరు యువకుల చేత అణచివేతకు గురైన ఎద్దు



ఎద్దు మోపురాన్ని మూతిని పట్టుకున్న యువకుడు



ముగ్గురు యువకులను పడగొట్టి ఇద్దరి యువకులకు చిక్కిన ఎద్దు

సమయపురం ఆలయంలో తైపూసఉత్సవాలు ప్రారంభం

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత వైష్ణవ క్షేత్రం శ్రీరంగంకు చేరువగా ఉన్న సమయపురం మారియమ్మన్ ఆలయంలో తైపూస వేడుకల ప్రారంభోత్సవం మంగళవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారు సర్వాభరణాలు ధరించి ధ్వజస్తంభం వద్ద వేంచేశారు. ఉదయం 7.28 గంటల సమయంలో ఆలయ ప్రధానార్చకులు ధ్వజస్తంభంపై అమ్మవారి రూపం ముద్రించి ఉన్న ధ్వజపటాన్ని ఆవిష్కరించి ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. ఈ తైపూస వేడుకల్లో అమ్మవారు ప్రతిరోజు రాత్రి సింహ, భూత, హంస, వృషభ, గజ, శేషవాహనం సహా పలు వాహనాల్లో తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. ఎనిమిదో రోజు అమ్మవారు రజత అశ్వవాహనంపై అధిరోహించి భక్తులను కటాక్షించనున్నారు. 9వ రోజు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

తెప్పోత్సవం జరగనుంది. 10వ రోజా ఈ నెల 25 ఉదయం 8 గంటలకు తైపూసం సందర్భంగా అమ్మవారు అద్దాల పల్లకీలో బయలుదేరి నొచ్చియం, మన్నస నల్లూరు మీదుగా వడ కావేరికి బయలుదేరి వెళతారు. ఆ రోజు సాయంత్రం కొల్లిడం వడ కావేరి తీర్థవారి జరగనుంది. అటు పిమ్మటం రాత్రి 10 గంటలకు తన సోదరుడైన రంగనాథస్వామి నుంచి సారె స్వీకరించే వేడుకలు జరుగుతాయి. ఈనెల 26 వేకువజాము 1 గంట నుండి 2 గంటల మధ్య మహా అభిషేకం నిర్వహించనున్నారు. ఆ తర్వాత ప్రత్యేక అలంకరణతో వేంచేసి భక్తులకు దర్శనమిస్తారు. ఆ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారిని ఊరేగిస్తారు. రాత్రి పాషాణ మండపానికి చేరుకుంటారు. అక్కడ అమ్మవారి అభిషేకం జరుగుతుంది. ఆలయ ప్రధానార్చకులు, నిర్వాహకుల సమక్షంలో ధ్వజావరోహణం జరుగుతుంది. చివరగా అమ్మవారు తిరువీధుల్లో ఊరేగి భక్తులకు కనువిందు చేయనున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులు తగు ఏర్పాట్లు చేపట్టేందుకు ఆలయ డిప్యూటీ కమిషనర్ కల్యాణి నాయకత్వంలో అధికారులు చర్యలు చేపడుతున్నారు.



ధ్వజస్తంభ మంటపంలో కొలువుదీరిన మారియమ్మన్

బృహదీశ్వరాలయ నందీశ్వరుడికి
2 టన్నుల కూరగాయలతో అలంకారం

చెన్నై, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చారిత్రక ప్రాచీన బృహదీశ్వరాలయంలో పశువుల పండుగ సందర్భంగా నందీశ్వరుడిని దర్శించేందుకు వేలాదిమంది భక్తులు తరలివెళ్లారు. యేటా పశువుల పండుగ సందర్భంగా ఆ ఆలయం ఎదుట 12 అడుగుల ఎత్తు, 19.5 అడుగుల పొడవు, 8.25 అడుగుల వెడల్పు, 20 టన్నుల బరువుగల నంది విగ్రహాన్ని కూరగాయలతో అలంకరించడం ఆనవాయితీ. ఆ మేరకు మంగళవారం ఉదయం ఆ మహానందీశ్వరుడిని రెండు టన్నుల కాయగూరలు, పండ్లతో అందంగా అలంకరించారు. పొడవు వంకాయలు, క్యాబేజీ, గుమ్మడికాయలు, ఉర్లగడ్డలు, అరటికాయలు, కాకరకాయలు, ముల్లంగి తదితర కూరగాయలు, ఆరెంజ్, అరటి, ఆపిల్, దానిమ్మ తదితర పండ్లతోను, పాలకోవా, స్వీట్లతోను ఆలయ ప్రధానార్చకులు నందీశ్వరుడిని అలంకరించారు. ఆ తర్వాత ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు, పాలు, పెరుగు, చందనం తదితర సుగంధ ద్రవాలతో ప్రత్యేక అభిషేకం జరిపారు. చివరగా మహాదీపారాధన నిర్వహించారు. అదే సమయంలో నందీశ్వరుడి ఎదుట 108 పశువులను వరుసగా నిలిపి



కూరగాయల అలంకారంలో మహానందీశ్వరుడు

ఉంచి వాటికి పసుపు, కుంకుమం, చందనంతో బొట్లు పెట్టి, మాలలు, పట్టు వస్త్రాలు ధరింపజేసి సామూహిక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్ని ముగిసిన తర్వాత నందీశ్వరుడికి అలంకరించిన కాయగూరలు, పండ్లను, స్వీట్లను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.